"కాని ఇలాంటి అవివేక పనులు చేయడంలో నీకు మంచి అనుభవం ఉందని చెప్పాను."

"నాకిలాంటి పనుల్లో అనుభవం ఉందా? ఈ రోజు మీరు చిత్రంగా మాట్లాడుతున్నారే."

చిన్నగా నవ్వి చెప్పాడు తండ్రి.

"'పూర్వ జన్మ కృతం పాపం వ్యాధి రూపేణ పీడితం' అని పెద్దలు ఆయుర్వేదంలో చెప్పారు. అంటే, మనం చేసే పాపాలన్నీ మనల్ని రోగాల రూపంలో బాధిస్తాయి అని అర్థం. నువ్వు ఎటూ నీ ఉద్యోగ నిర్వహణలో లంచాలు తీసుకుంటున్నావు. లంచం ఇచ్చినవారి ఉసురు తగిలి ఎలాగూ ఆ పాపాలకి నీకు పక్షవాతమో, ఇంకేదైనా భయంకర రోగమో వచ్చి చావడం ఖాయం. కాకపోతే నువు నీ ఉద్యోగంలో ఉండగా రోజుకి కొంచెం కొంచెంగా ఆ రోగాలని పోగు చేసుకుంటున్నావు. ఈ రోగదానం ఒక్కసారిగా పుచ్చుకోవడంవల్ల నీకా సంగతి స్పష్టంగా తెలుస్తోందంతే."

తను రోజుకి కొంత చొప్పున లంచాల రూపంలో ఆర్జించే పాపాన్ని గురించి, దాన్ని తనే ఎప్పటికైనా అనుభవించక తప్పదని తండ్రి తనకిలా అన్యాపదేశంగా ఉపదేశిస్తున్నాడని కొడుక్కి అర్థమైంది. తండ్రి హెచ్చరికలోని హితవుని గ్రహించిన ఆ కొడుక్కి జ్ఞానోదయమైంది. తన భార్య, పిల్లలు తను సంపాదించేది అనుభవిస్తే, తన పాప ఫలాన్ని మాత్రం తనే అనుభవించాలన్న సత్యం బోధపడటంతో అంతదాకా వక్రమార్గంలో సంపాదించినదంతా అతను బీదసాదలకి దానం చేసేసి, నిజాయితీగా బ్రతకసాగాడు.

## 47. పార్క్‌లో ఓ సాయంత్రం

ఓ చిన్నపిల్లవాడికి భగవంతుడు ఎలా ఉంటాడో చూడాలన్న కోరిక కలిగింది. దేవుడు తమ ఊరికి చాలా దూరంలో ఉంటాడని విని వుండటంతో,

ఆ కుర్రాడు తల్లికి చెప్పి ఓ సంచిలో కారం అటుకులు, ఓ మంచినీళ్ళ సీసా తీసుకుని దేవుడ్ని చూడటానికి బయలుదేరాడు.

మధ్యాహ్నం అయ్యేసరికి అతనికి ఆకలి వేయసాగింది. దాంతో ఓ పార్క్‌లోకి వెళ్ళి నీడగా ఉన్న స్థలం చూసుకుని ఓ బెంచిమీద కూర్చుని తన సంచీ విప్పాడు. అటుకుల మూటని బయటకి తీసి తను తినబోతూ, పక్కనే బెంచీమీద కూర్చుని ఉన్న ఓ ముసలావిడని చూసి ఆవిడకి కూడా కొన్ని అటుకులు పెట్టాడు.

ఆ పిల్లవాడి సంస్కారానికి ముచ్చటేసిన ఆ ముసలావిడ వాటిని సంతోషంతో స్వీకరించింది. ఇద్దరూ కలిసి వాటిని తిన్నాక ఆవిడకి మంచినీళ్ళ సీసాని ఇచ్చాడు. చిరునవ్వుతో ఆవిడ వాటిని తాగి సీసాని తిరిగి ఆ పిల్లవాడికి ఇచ్చింది. ఆ కుర్రాడికెంతో ఆనందం వేసింది.

ఇద్దరూ చాలాసేపు ఒకరితో మరొకరు మాట్లాడుకోకుండా, ఒకరివంక మరొకరు చూసి మృదువుగా నవ్వుకుంటూ అలాగే కూర్చున్నారు.

చీకటి పడుతూండగా ఆ కుర్రాడు అయిష్టంగానే లేచాడు. ఆవిడ కూడా లేచింది. ఆవిడ ఆ కుర్రాడి వంక చూసి మళ్ళీ ఆనందంగా నవ్వింది.

సంచీ అందుకుని ఆ కుర్రాడు ఇంటిదారి పట్టాడు. కొద్దిసేపటికి ఆ పిల్లవాడు తన ఇంటికి చేరుకుని తలుపు తట్టాడు. తలుపు తీసిన వాడి తల్లి ఆనందంతో వెలిగిపోతున్న తన కొడుకు మొహం చూసి అడిగింది.

"అప్పుడే వచ్చేసావే? దేవుడు కనిపించాడా నీకు?"

"కనిపించాడమ్మా. ఎంత అందంగా ఉందో తెలుసా ఆ నవ్వు?"

తల్లి తన కొడుకు కోరిక తీరినందుకు ఎంతో సంతోషించింది.

"నీకోటి తెలుసామ్మా? దేవుడు మగ కాదు. ఆడ." చెప్పాడు.

అదే సమయంలో ఆ ఊళ్ళోని ఓ గుడిసెలోకి ఆ ముసలావిడ వచ్చింది. ఇంట్లోకి వస్తున్న తల్లిని చూసి అడిగిందామె కూతురు.

"అమ్మా! ఇవాళ ఏమిటంత ఆనందంగా ఉన్నావు?"

"నేనివ్వాళ పార్క్‌లో దేవుడితో కలిసి కారపు అటుకులు తిన్నాను తెలుసా?" ఆనందంగా చెప్పిందావిడ.

"నిజంగా?"

"అవును. నేనూహించిన దానికన్నా దేవుడు ఎంతో చిన్నవాడు." కూతురికి చెప్పిందావిడ.

## 48. కాపలా

చాలా ఏళ్ళ క్రితం జరిగిన కథ ఇది.

అప్పట్లో మల్లప్ప అనే ఓ భక్తుడు శ్రీశైలంలో ఓ అన్నదాన సత్రాన్ని నిర్వహిస్తూండేవాడు. ఆ సత్రానికి అనేకమంది దాతలుండేవారు.

ఓ రోజు మల్లప్ప దాతలిచ్చిన డబ్బుతో ఆహార పదార్థాలు కొనుక్కురావడానికి శ్రీశైలంనించి ఆత్మకూరు బయలుదేరాడు. దారంతా చిట్టడవి. ఆ రాత్రి అడవిలో ఓ చెట్టు కింద నిద్రించి మర్నాడు ఉదయం ఆత్మకూరు చేరుకున్నాడు.

బజారులో ఓ ధనవంతుడు కనిపించి ఆహార పదార్థాలన్నీ తనే మల్లప్పకి కొనిచ్చాడు.

"మీ సత్రానికి నేను, మా ఊరివాళ్ళం అనేకసార్లు వచ్చి భోజనం చేసాం. అందుకు బదులుగా నేను చేయగలిగే కనీస సేవ ఇది." చెప్పాడతను కృతజ్ఞతగా.

అదంతా ఆ మల్లికార్జునుడి కృప అనుకుని మల్లప్ప ఆ ఆహార పదార్థాలతో, తనతో తెచ్చిన రొక్కంతో తిరుగు ప్రయాణం చేసాడు. దారిలో ఆ రాత్రి కూడా అడవిలో అదే చెట్టు కింద పడుకున్నాడు. క్షణాల్లో అతనికి గాఢనిద్ర పట్టింది. తనని దోచుకోడానికి ఆత్మకూరు నించి ఓ దొంగలముఠా తనని వెన్నంటి వస్తోందన్న సంగతి అతనికి తెలీదు.